## 39

# ఒక సూచక క్రియ కొరకైన ప్రజల కోరిక

## (16:1-4)

యేసు యెడల ప్రజా సమూహములు ప్రదర్శించిన విభిన్నములైన ప్రతిస్పందనల ప్రాతిపదిక 16వ అధ్యాయంలో కూడ కొనసాగుచున్నది. ఈ అధ్యాయంలోని ప్రారంభ వచనాల్లో, పరిసయ్యులు మరియు సద్దూకయ్యులు ఆయనను మెస్సీయాగా నిరాకరించారు ఆయనను అపఖ్యాతి పాలుజేయుటకు ప్రయత్నించారు (16:1–4). ఈ సంఘటన తరువాత, యూదా మత నాయకుల సంశయవాదము గూర్చి యేసు తన శిష్యులను హెచ్చరించాడు (16:5–12). ఆ తరువాత ఆయన తన గుర్తింపు గూర్చి తన శిష్యులతో ముఖాముఖిగా చర్చించాడు, ఫలితంగా పేతురు, "నీవు సజీవుడైన దేవుని కుమారుడవైన క్రీస్తువని" యేసును గూర్చి ఒప్పుకొన్నాడు (16:13–20).

ఈ ఒప్పుకోలు తదనంతరం, తాను మరణించుట, సమాధి చేయబడుట, మరియు పునరుత్థానుడగుట గూర్చి యేసు తన శిష్యులకు ముందుగానే తెలియజేసాడు. ఈ విషయాన్ని అంగీకరించుటకు ఇష్టపడక, పేతురు ఆయనను ఒక ప్రక్కకు తీసికొనివెళ్లి ఆయనను గద్దింపసాగాడు; అయితే క్రీస్తు శ్రమపడవలసి యున్నదను వాస్తవము పేతురు అవగాహనకు అందలేదని స్పష్టముగా అర్థమగుచున్నది (16:21–23). ఈ సందర్భమును అనుకూలము చేసికొనుచు, యేసు శిష్యత్వము గూర్చి, వారి యజమానుని వలెనే శ్రమపడవలసి యుండునను వాస్తవము గూర్చి తన శిష్యులకు సంపూర్ణమైన అవగాహనను కలుగజేసాడు (16:24–27). ఈ సంభాషణలోని తన తుది పలుకులలో, దేవుని రాజ్యము వారి జీవితకాలములోనే వచ్చునని ప్రభువు వారికి అభయమిచ్చాడు (16:28).

### ప్రశ్న (16:1)

**1 అప్పుడు పరిసయ్యులును సద్దూకయ్యులను వచ్చి ఆయనను శోధించుటకు ఆకాశము నుండి యొక సూచక క్రియను తమకు చూపుమని ఆయననడిగిరి.**

యూదుల మత నాయకులలో అధిక సంఖ్యాకులు యేసును మెస్సీయాగా నిరాకరించారని మత్తయి 16:1–4 నొక్కివక్కాణించుచున్నది. ఈ సన్నివేశము 12:38–42లోని సంఘటన అనగా, నాయకులలో కొందరు యేసు యొద్దకు వచ్చి ఒక సూచక క్రియ చూపుమని అడిగిన సందర్భము వంటిదై యున్నది. ఈ రెండు సందర్భములలోను యేసు ప్రదర్శించిన ప్రతిస్పందన ఒకే విధముగా నున్నది: వారు ప్రవక్తయైన యోనా గూర్చిన సూచక క్రియ తప్ప, మరొకటి పొందరు.

**వచనము 1**. యేసు తన వ్యక్తిగత పరిచర్య ప్రారంభించినది మొదలుకొని, ఆయన ఎదుర్కొనిన వ్యతిరేకత, అనగా నోటిమాటలతోను దృఢనిశ్చయముతోను తెలుపబడిన

అత్యధిక వ్యతిరేకత యూదా మత నాయకుల నుండి వచ్చినది, ప్రధానంగా **పరిసయ్యుల** వర్గమునకు చెందినవారి నుండి వచ్చినది. "పరిసయ్యులు" అనగా "వేరుచేయబడినవారు" అని అర్థము. అది వారికి సరిగా సరిపోతుంది, ఏలయనగా వారు యూదులను ఇతరులందరి నుండి ఇంచుమించుగా తమ్మునుతాము వేరుచేసికొనినవారై యుండిరి. వారు ఆధ్యాత్మిక విద్యావంతులు, తీవ్ర గూఢమార్గవాదులు, మూలసూత్రగాములు, మరియు వారి కాలము నాటి సాంప్రదాయములకు బద్ధులై యుండిన వర్గమునకు చెందియుండిరి (3:7పై గల వ్యాఖ్యానము చూడు).

**సద్దూకయ్యులు** చివరిసారిగా 3:7లో పేర్కొనబడియున్నారు. వారి గూర్చి క్రొత్త నిబంధనలో తెలియజెప్పబడినదాని కంటె ఇతరత్రా అంత ఎక్కువగా తెలియదు. వారు యూదా మత నాయకులలో కూడ ఉండిరి. వారు ధనిక స్వామ్యమునకు చెందినవారై యుండి, వారిలో నుండే అనేక మంది ఉన్నత యాజకులుగాను, ప్రధాన యాజకులుగాను ఉండిరని అతిశయించుచుండిరి, అట్లయినను శాస్త్రులు మరియు యాజకులు ఈ రెండు తెగలలోను ఉండిరి. సద్దూకయ్యులు యూదా మత బోధకుల (రబ్బానీ విధానము) సాంప్రదాయమునకు ఎక్కువ ప్రాముఖ్యతనీయలేదు గనుక మతము, సంస్కృతి, లేదా రాజకీయ సంబంధమైన విషయములలో రాజీ కుదుర్చుకొనుటకు వెనుకంజవేయలేదు. వారు లేఖనములను, ప్రాథమికంగా పంచకాండములను నమ్ముచుండిరని సాధికారపూర్వకంగా చెప్పుకొనుచుండిరి, కాని వారి అనువాదము వాటి ఆచరణాత్మక అర్థమును కోల్పోవునంత అధికంగా అధ్యాత్మికత ఆపాదింపబడుచుండినది. ఈ యూదులు సంస్కరణలకు, మార్పులకు, ప్రగతి కార్యక్రమములకు అత్యధిక ప్రాధాన్యత నిచ్చువారును, భౌతిక విషయములకు ప్రాధాన్యతనిచ్చు వర్గమువారునై యుండిరి. వారు దేవదూతలు, అమరత్వము, పునరుత్థానము, లేదా ప్రకృతి బాహ్యమైనదని అని సూచించిన మరి దేనిలోను నమ్మకముంచలేదు (3:7పై గల వ్యాఖ్యానము చూడు).

పరిసయ్యులు మరియు సద్దూకయ్యులు ఒకే వేదిక మీదికి వచ్చియుండుట ఒక అసాధారణమైన అంశముగా అగుపించవచ్చును, ఏలయనగా వారు మత విషయములోనైతేనేమి, రాజకీయ విషయములలోనైతేనేమి బొత్తిగా తూర్పు పడమరల మాదిరిగా వ్యతిరేకులై యుండిరి. ఈ రెండు గుంపుల నడుమ భారీ భిన్నాభిప్రాయములుండినప్పటికిని, యేసుకు వ్యతిరేకముగా ప్రదర్శింపబడుచుండిన శత్రు చర్యలలో వారు ఏకమగుచుండిరి (22:15-46 చూడు). వారు ఒకరినొకరు నీచముగా ఎంచుచుండిరి, కాని యేసును అంత కంటె ఎక్కువ ద్వేషించారు. యేసు వారి సాంప్రదాయములను సవాలు చేయుచుండిన విషయమును పరిసయ్యులు ప్రశంసించలేదు, అయితే సద్దూకయ్యులు రోమా ప్రభుత్వ ప్రతీకారమునకు తావిచ్చు మెస్సీయా సంబంధమైన ఎటువంటి కదలికలనైనను వ్యతిరేకించుచుండిరి.

యేసు చేయుచుండిన అద్భుతకార్యములనుబట్టి దేవుని స్తుతించుచుండిన అన్యజనుల సమూహములకు విరుద్ధముగా (15:31), ఆయనను అపఖ్యాతిపాలు చేయవలెనను ఉద్దేశముతోనే యూదా మత నాయకులు ఆయన యొద్దకు వచ్చినట్లు స్పష్టమగుచున్నది. **పరీక్షించుటకు** అని అర్థమిచ్చుచున్న గ్రీకు పదము (*peirazō*) సశోధించుటకు (KJV) అని కూడ అనువదింపబడవచ్చును. యేసును అరణ్యములో అపవాది శోధించిన సందర్భములో ఇదే క్రియా పదము ప్రయోగింపబడినది (4:1పై గల వ్యాఖ్యానము చూడు). ఈ యూదా

నాయకులు, శోధకుని వలెనే, వారు యేసునడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పలేక ఆయన చూపునకైనా ఓడిపోవలెనని వారాశించుచుండిరి (19:3; 22:18, 35 చూడు). వారు యేసును బైబిల్ ప్రామాణికముగా పరీక్షించుచుండిరని వారు అనుకొనినప్పటికిని (ద్వితీయోపదేశకాండము 13:1-3; 18:15-22), వాస్తవమునకు వారు దేవునినే శోధించుచుండిరని (ద్వితీయోపదేశకాండము 6:16; కీర్తనలు 95:8, 9; హెబ్రీయులకు 3:7-11) డగ్లస్ ఆర్. ఏ. హేర్ చెప్పుచున్నాడు. ఎంతైనా, పునరావృతమగుచుండిన అద్భుతకార్యముల ద్వారా యేసు తన గుర్తింపును అదివరకే రుజువుపర్చాడు.[1]

**వారికి ఆకాశము నుండి యొక సూచక క్రియను తమకు చూపుమని** యూదా నాయకులు ఆయనను అడిగారు. ఈ మనవి అనేక సందర్భములలో చేయబడినది (12:38-42; లూకా 11:16; యోహాను 2:18; 6:30). యేసు చేసిన అద్భుతకార్యములు, ఇటీవలనే చేసిన స్వస్థత కార్యములు, అవే ఆకాశము నుండి కలిగిన అసలైన సూచక క్రియలై యుండినవి; కాని ఆయన శత్రువులు వాటికి మించినది మరొకటి ఏదో ఆయన చూపించవలెనని ఆశించారు. మేము కూడ చేయుచున్నామని ఇతరులు అధికారంగా చెప్పుకొనుచుండిన సామాన్య స్వస్థత కార్యములు కాదు కాని, భూమినే కంపింపజేయునంతటి గొప్ప కార్యము ఏదో ఒకటి చూపవలెనని వారాశించారు.[2] వారు యేసు శక్తిని శంకించలేదు, కాని ఆ శక్తి దేవుని నుండి కలిగినదేనని అంగీకరించుటకు వారు నిరాకరించారు. ఆయన సాతాను సంబంధియైనవాడని వారు ఆయనను నిందించారు (12:24).

"సూచక క్రియ," ఒకడు దైవికమైన శక్తి కలిగియున్నాడని గుర్తింపబడునట్లు అవకాశము కల్పించు ఒక అద్భుతమై యుండినది; అది అతని అధికారమును రూఢిపర్చినది (11:2-6; యోహాను 1:29-34; 20:30, 31 చూడు). "ఆకాశమునుండి" అను పదజాలము "దేవుని నుండి" అని చెప్పుకొనుటకు ఒక పరోక్షమైన విధానమై యుండవచ్చును. యేసే మెస్సీయాయై అధికారపూర్వకంగా తెలియజెప్పబడునట్లు బహుశా వారు దేవుని నుండి ఒక నిర్వివాదాంశమైన నిదర్శనమును ఆశించియుండవచ్చును. "ఆకాశము నుండి" అను పదజాలము "ఆకాశములో" అని కూడ అర్థమీయవచ్చును. బహుశా మోషే కాలములో ఆకాశము నుండి కురిపింపబడిన మన్నా వంటి ఏదో ఒక పదార్థము చూపింపబడవలెనని (నిర్గమకాండము 16:1-36), లేదా యెహోషువా రోజుల్లో జరిగినట్లు సూర్యుడు నిలిచిపోవుట (యెహోషువ 10:12-14), లేదా ఏలీయా కాలములో ఆకాశము నుండి అగ్ని దిగివచ్చినట్లు దిగిరావలెనని (1 రాజులు 18:30-40) వారాశించియుండవచ్చును.

## యేసు ఇచ్చిన జవాబు
## (16:2-4)

**2ఆయన ఇట్లనెను, సాయంకాలమున మీరు–ఆకాశము ఎఱ్ఱగా ఉన్నది గనుక వర్షము కురియదనియు, 3ఉదయమున ఆకాశము ఎఱ్ఱగాను మబ్బుగాను ఉన్నది గనుక నేడు గాలివాన వచ్చుననియు చెప్పుదురు గదా. మీరు ఆకాశవైఖరి వివేచింప నెరుగుదురు గాని యీ కాలముల సూచనలను వివేచింపలేరు. 4వ్యభిచారులైన చెడ్డతరము వారు సూచక క్రియ నడుగుచున్నారు, అయితే యోనాను గూర్చిన సూచక క్రియయేగాని మరి ఏ సూచక క్రియయైన వారి కనుగ్రహింపబడదని వారితో చెప్పి వారిని విడిచివెళ్లిపోయెను.**

**వచనములు 2, 3.** వారిలో కొరతగా నుండిన లోతైన అధ్యాత్మిక అవగాహనను బహిర్గతము చేయుట ద్వారా యేసు పరిసయ్యులు మరియు సద్దూకయ్యులకు సమాధానమిచ్చాడు:

> సాయంకాలమున మీరు–ఆకాశము ఎఱ్ఱగా ఉన్నది గనుక వర్షము కురియదనియు, ఉదయమున ఆకాశము ఎఱ్ఱగాను మబ్బుగాను ఉన్నది గనుక నేడు గాలివాన వచ్చుననియు చెప్పుదురు గదా. మీరు ఆకాశవైఖరి వివేచింప నెరుగుదురు గాని యీ కాలముల సూచనలను వివేచింపలేరు?

ఈ మాటలను అనేక ప్రాచీన చేతిరాత ప్రతులు విడిచిపెట్టుచున్నవి,[3] కాని అనేకమైన ఇతర రచనలలో ఇవి చేర్చబడియున్నవి. గనుక ఈ మాటలు అటుతరువాత చేర్చబడినవని కొందరు, పేర్కొనబడిన అదే వాతావరణ పరిస్థితులను ప్రతిబింబించని (ఐగుప్తు వాతావరణము వంటి) వాతావరణములలో పనిచేయుచుండిన శాస్త్రుల చేత అవి విడిచిపెట్టబడినవని యింకొందరు పండితులు నమ్ముటకు ఇదొక హేతువగుచున్నది.[4] ఈ నిదర్శనమునకు గల ప్రాధాన్యత గ్రంథ పాఠము యొక్క ప్రామాణికత్వముపై ఆధారపడియున్నది.

ఆయన ఇచ్చిన సమాధానములో యేసు యూదా నాయకుల భాషాపరంగా కొంత పదచమత్కారమును ప్రయోగించి యుండవచ్చును; మొదటి వచనములో "ఆకాశము" అని అనువదింపబడిన గ్రీకు పదము (*ouranos*), రెండవ వచనములో "ఆకాశము" అని అనువదింపబడిన గ్రీకు పదము ఒకటే. యేసు ఇచ్చిన సమాధానము, "ఉదయకాల ఎరుపు ఆకాశం, నావికుడా జాగ్రత్త!; సాయంకాల ఎరుపు ఆకాశం, నావికుడా ఆనందించు"[5] అని పాత కాలం నాటి నావికులు చెప్పుకొనుచుండిన లోకోక్తిని పోలియున్నది. సాయంకాలం వేళల్లో ఆకాశం ఎరుపుగా ఉన్నప్పుడు, సాధారణంగా మరుసటి రోజు వాతావరణం చాల మంచిదిగా ఉంటుంది. అదే ఆకాశం ఉదయకాలం వేళల్లో ఎరుపుగా ఉన్నప్పుడు, పెనుతుఫాను రానైయున్నదని తెలుపుటకు అదొక సూచనయై యుండినది. ఈ నాయకులు వాతావరణ సంకేతములను నిర్ధారించగలుగుచుండిరి,[6] కాని వారి యెదుటనే నెరవేరుచుండిన ఆధ్యాత్మిక సూచనలను బొత్తిగా మర్చిపోయినట్లున్నారని యేసు చెప్పుచుండెను.

"కాలములు సూచనలు" అను పదజాలములో వారి మధ్యనే ఉండిన యేసు యొక్క మూర్తిమంతము మరియు కార్యకలాపము కలిసియుండినవి. యేసు వారి మధ్య అసాధారణముగా ఉపస్థితుడై యుండుట ప్రజలు యేసును అంగీకరించుటకు పశ్చాత్తాపముతో తీర్మానించుకొనునట్లు లేదా ఆయనను తృణీకరించి ఆయన రాకడ సమయంలో జరుగు తీర్పును ఎదుర్కొనునట్లు బలవంతము చేయబడు దినములు వచ్చియున్నవని సూచించినది.[7]

**వచనము 4**. యేసు, నిస్సందేహంగా వారి అపనమ్మకమునుబట్టి హృదయము బ్రద్దలైనవాడై (మార్కు 8:12). **వ్యభిచారులైన చెడ్డతరమువారు సూచక క్రియ నడుగుచున్నారని** యూదా నాయకులతో అన్నాడు. వారిని వర్ణించుటకు ఆయన ఈ మనఃకల్పనను పాత నిబంధనలో నుండి తీసికొన్నాడు; ఈ ప్రజలు ఆధ్యాత్మికముగా దేవుని యెడల విశ్వాసఘాతకులైనవారుగా యుండిరి (ద్వితీయోపదేశకాండము 32:5; యెషయా 50:1; యిర్మీయా 3:8; 13:27; 31:32; యెహెజ్కేలు 16:32–43;

హోషేయ 2:1-20 చూడు).

**యోనాను గూర్చిన సూచక క్రియయేగాని మరి ఏ సూచక క్రియయైన వారికనుగ్రహింపబడదని** యేసు చెప్పెను. ఇతర శాస్త్రులను మరియు పరిసయ్యులను ఎదుర్కొనుచుండినప్పుడు కూడ యేసు ఇదే సోదాహరణ చిత్రీకరణమును ప్రయోగించాడు. ఇంతకు మునుపటి సందర్భములో, "యోనా మూడు రాత్రింబగళ్లు తిమింగలము కడుపులో ఏలాగుండెనో, అలాగు మనుష్యకుమారుడు మూడు రాత్రింబగళ్లు భూగర్భములో ఉండునని" ఆయన సెలవిచ్చాడు (12:40). "యోనాను గూర్చిన సూచక క్రియ" అను పదజాలము క్రీస్తు పునఃరుత్థానమునకు ముందు ఛాయయై యుండినది (12:39, 40పై గల వ్యాఖ్యానము చూడు). ఈ గొప్ప అద్భుతము, యేసు దేవుని కుమారుడై యున్నాడని రుజువు చేసిన అద్భుతము (రోమీయులకు 1:2-7), కూడ యూదా నాయకుల చేత తృణీకరింపబడినది. నిజాయితీలేని ఈ నాయకులు, కావలివారిని తెచ్చి సమాధి ద్వారము యొద్ద కావలియుండుట ద్వారా, పై సత్యాన్ని కప్పిపుచ్చుటకు ప్రయత్నించారు (మత్తయి 28:11-15).

యేసు ప్రతిస్పందించిన పిమ్మట, **ఆయన వారిని విడిచివెళ్లిపోయెను.**

✧✧✧✧✧ **పాఠములు** ✧✧✧✧✧

### అధ్యాత్మిక అంధత్వము (16:1-4)

ఈ సంక్షిప్త వాక్యభాగములో, అధ్యాత్మిక అంధత్వము చేత బాధపడుచుండువారి నాలుగు లక్షణములను మనము చూడవచ్చును: (1) ఆధ్యాత్మికముగా అంధులైనవారు అంధకారమునే వెదకుచుందురు, (2) వారు వెలుగును శపించుతురు, (3) వారు అంతకంతకు అధికమైన అంధకారములోనికి తిరోగమించుదురు, మరియు (4) వారు దేవుని చేత విడిచిపెట్టబడుదురు.

### విజ్ఞానశాస్త్రీయమైనదే, కాని ఆధ్యాత్మికమైనది కాదు (16:2, 3)

పరిసయ్యులు మరియు సద్దూకయ్యులు వాతావరణము గూర్చి ముందుగానే చెప్పగలవారై యుండిరి కాని "కాలముల సూచనలను" వివేచింపలేకపోయి నందుకు యేసు వారిని తీవ్రముగా దండించాడు. వారు ఆయన బోధలను నిరాకరించుచు అద్భుతకార్యములను తోసిపుచ్చారు, అంతేగాక ఆయన క్రీస్తైయుండిన గుర్తింపును అపఖ్యాతిపాలుజేసారు. ఆయన వారిని ఖండించినట్లయితే, నేటి మన తరము ప్రజల గూర్చి ఆయన ఏమని పలుకును? నానా విధములైన వాతావరణ పరిస్థితులను (అనేకమైన ఇతర విజ్ఞానశాస్త్ర పరిశోధనలతో పాటు) అధ్యయనము చేయుటలో మనము ఎంతో ప్రగతి సాధించాము, కాని భౌతిక ప్రపంచమును గూర్చిన ఇటువంటి తెలివి ఆధ్యాత్మిక ఎరుకకు సాటి రాదు. అనేకులు స్వీయ అనైతికతను బొత్తిగా మర్చిపోయి, క్రీస్తు (రెండవ) రాకడను మరియు రానైయున్న తీర్పును గంభీరముగా పరిగణించుటలేదు.

డేవిడ్ స్టూవర్ట్

సూచనలు

[1]Douglas R. A Hare, *Matthew*, Interpretation (Louisville: John Knox Press, 1993), 183. [2]Leon Morris, *The Gospel according to Matthew*, Pillar Commentary (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1992), 413. [3]ఈ మాటలు మార్కు వ్రాసిన సువార్తలోని సమాంతర నివేదికలో కూడ కనబడుటలేదు (మార్కు 8:11, 12). [4]Bruce M. Metzger, *A Textual Commentary on the Greek New Testament*, 2d ed. (Stuttgart: German Bible Society, 1994), 33. [5]Theophrastus *Concerning Weather Signs* 1.10 ఈ సూత్రమునకు సంబంధించిన అత్యాదిమ రికార్డు అయియున్నది. Theophrastus (c. 371-c. 287 B.C.) అరిస్టాటల్ తరువాత వచ్చినవాడు. [6]ప్రాచీన కాలము నాటి ప్రజలు కొన్ని మేఘా రూపురేఖల నమూనాల ఆధారంగా వాతావరణ పరిస్థితులను తరుచుగా ముందుగానే తెలియజెప్పుచుండిరి. (Pliny *Natural History* 18:78; Virgil *Georgics* 1.438-60; Talmud *Yoma* 21b.) [7]David Hill, *The Gospel of Matthew*, The New Century Bible Commentary (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1972), 257.